# యాదమ్మ

చెన్ను సుశీలారామం



"అమ్మగోరూ... అమ్మగోరూ..." పనిమనిషి యాదమ్మ పెరటి తలుపు తడ్తుతూంది. పిలుపు విని లేచివచ్చి తలుపు తెరిచింది సీత. యాదమ్మ, ఆమె కూతురు గౌరి లోపలికొచ్చారు.


"యాదమ్మా... కూతుర్ని చూసొస్తానని ఊరెళ్ళి ఏకంగా, గౌరినే వెంటబెట్టుకొచ్చావా? మంచిపని చేశావ్. ఏవిటే గౌరీ... ఇంత నీర్సంగా వున్నావ్? ఒంట్లో బావుండలేదా?"

"అదేం గాదమ్మా... నాను మొన్న ఈరకత్తింటికి కెల్లానా... అక్కడ నా బిడ్డ పాట్లు ఏటి సెప్పనమ్మా... అత్తింటో ఇది పనిమడిసి, వొంట మడిసి, పాకీ మడిసి, సమత్తవైన అవుతారాలు ఎత్తి గొడ్డు మాదిరిగ ఊడిగం సేత్తా వుంది. సెయ్యాల. ఆడ గుంట అత్తారింటికాడ పనిపాటు సేసుకుంటూ అత్తా మావల్కి సేవ సేసుకోవాల.... దానికి నానొప్పుకుంటాను... కాని గుర్రాల్లా ఎదిగి కూకున్న ఆడబొట్టు లిద్దరున్నారు కందా... ఆల్లకు కన్ను కాలు సెయ్యి తిన్నంగా ఉన్నాయిగందా... ఇంటెడు సాకిరీ... వొదిన వొంటి సేతి మీద సేసుకొత్తా వుంటే... కూసింత సాయవెల్లాలని ఆ ఆడగుంటలికి నేదమ్మా... కోడలికి సాయవెల్లండని ఆ ముసిల్దీ సెప్పదు. ఆ సాకిరీకి తోడు ఆల్లకి నాలుగు పెయ్యలుండాయి. ఆటిపనీ ఇదే సూసుకోవాలి... నాను నా కల్లారా నా బిడ్డ ఎసుమంటి పరిత్తితుల్లో వుందో సూసినాను. ఆల్లకి తెలిసి రావాలనే దీన్నెంటెట్టుకొచ్చిసినాను. ఒలే గవురీ! నువ్వెల్లి ఆ మొక్కలకి నీల్లు పొయ్యిమీ..."

కూతురికి పని పురమాయించి యాదమ్మ వంటగదిలో వున్న అంట్ల గిన్నెలు తెచ్చుకుని పెరట్లో వున్న కొళాయి దగ్గర పెట్టుకోసాగింది. పనేం లేక సీత అక్కడే కూచుంది.

"చూడు యాదమ్మా!... గౌరి ఆడబిడ్డలు రేపో మాపో పెళ్ళిళ్ళు చేసుకుని అత్తారిళ్ళకు పోతారాయె... ఈ లోపు నువ్వు తొందరపడి గౌరినిక్కడికి తీసుకొచ్చేశావేంటి? అత్త మావ లిద్దరూ ముసలాళ్ళాయె. ఇదిక్కడికొచ్చేస్తే వాళ్ళకెవరు చేసి పెడతారు? ఆడబిడ్డలిద్దరూ ఏ పనీ చెయ్యరని నువ్వే గదా అన్నావు? రెండ్రోజులుంచుకుని, గౌరిని పంపించెయ్యి. లేకుంటే, నీ అల్లుడికి కోపం వస్తుంది..."

"అసలు దీన్ని నా ఎంటెట్టుకొచ్చేయ్యడాని క్కారనం ఆడేనమ్మా. తవరన్న ఇదంగా నాను ఆలోచించుకుని పల్లకుండిపోనాను. ఇయ్యాల గాకుంటే రేపైనా ఆల్లకే తెలుసుద్దిలే... కాటిక్కాల్లు సాసుకున్న ముసిలోల్ల నొగ్గిసి, దీన్నెందుకు తీసుకురాడం అనుకున్నా. కాని నా అల్లుడోడికి గేనం నేదమ్మా... ఆడు అనుమానం పిశాచి. ఈ ఇసయం నా బిడ్డ నాకెప్పుడూ సెప్పనేదు. కూతురి



**ఇటీవల హైదరాబాదులో ఆం.ప్ర.రాష్ట్ర ప్రభుత్వం తరఫున జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ సి.నారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రథమ బహుమతిని అందుకుంటున్న కూచిపూడి నర్తకి కుమారి రాధ**

కాపరవెట్టగుందోనని నానూ ఎప్పుడూ ఎల్లి అక్కడ నాలుగు దినాలుండి సూసిందీ నేదు. ఇదిగో ఇంత కాలానికి ఎల్లి రెండు దినాలుండే సరికి అక్కడ నా బిడ్డ ఎసుమంటి బాద లనుబగిత్తందో నా కల్లారా సూసినాను. నా అల్లుడోడెలాంటోడో నా కూతుర్నెట్టగ రాసి రంపాన్నెట్టేత్తన్నడో ఇరుగు పొరుగు సెప్పినారు. ఏంటే ఈ గోరం అని నిలదీత్తే అప్పుడు ఇది ఏడుత్తూ అసలిశయం సెప్పుకొచ్చింది. ఇంత కాలం ఎందుకు దాపరికవెట్టేసినావే అంటే.... నువ్వు బాదపడ్తావని సెప్పనేదు. నువ్వు మనసు కట్టవెట్టుకుంటే నాను సూళ్ళేనమ్మా అంటూ గొల్లుమంది నా బిడ్డ."

"నిప్పు సెంగుక్కట్టుకుంటే దాగుద్దామ్మా? ఐనా అమ్మగోరూ! ఆడన్ని మాటలంటా, అవమానిత్తా వుంటే ఆడి కాల్లకాడే పల్లకుంటూ పడుండాల్సిన కర్మం దీనికేటమ్మా? దీనికి మనువుగాక మునుపు నా అన్న కొడుకునే ... నా అల్లుడు సేసుకుందారనుకున్నా. ఆ కారనంగా ఒకరంటే ఒకరు అబిమానం కొద్దీ సినిమాలకి, సికార్లకీ తిరిగినారు. అంత మాత్తరాన్న ఆల్లు సెడిపోయినట్టేనా? మా వొదినికీ, నాకూ ఎయ్యో పట్టింపులొచ్చి మా మద్దిన మాటా మాటా పెరిగి గొడవలయ్యి నా బిడ్డని ఆల్లింటి కోడల్ని సేసుకోం బొమ్మన్నారు. ఆ మట్టున నా అన్న కొడుక్కింకా మనువు కుదరక ముందే మా గవురికి సంబందం ఎదికి మనువు సేసీసినాను..." యాదమ్మ గిన్నెలు తోముతుంటే గౌరి వచ్చి కడగసాగింది.

"సూడండమ్మగోరూ... ఒక మొగ్గుంటడు, వొకాడగుంట కల్సి సినిమా సూసినంత మాత్తరాన కల్సి సికార్లు తిరిగినంత మాత్తర్న ఆల్లు సెడిపోయినట్టేనా? నాలుగేండ్లు కాపరం సేసి ముగ్గురు గుంటల్ని కన్నాక ఆలినసుమానిత్తన్నా డంటే... ఆడేం మొగోడమ్మా? ఎదవన్నరెదవ... మనువు గాక ముందే నా బిడ్డ శీలం తనికీ సేయించాల్సిందట! ఇనుకున్నారామ్మా? నిజవే... ఆడన్నట్టు నా కూతుర్ని దవాకానాకు తోలుకుబోయి తనకీ సేయించాలి... మరిగట్టనే... ఆ మొగెదవని కూడా, తనకీ సేయిత్తే? అట్ట సేయించినా... ఆడు సీలవంతుడో సెడిపోయినోడో ... ఎవురికి మాత్రం ఎట్ట తెలుస్తది? ఆ బగమంతుడే మగెదవల్నట్టగ సుస్టించి నాడయ్యె.... అందుకే ఆల్లన్ని నకరాలు బోతన్నరు. ఆడకూతుల్లిటా అట్టకట్టాల డ్తన్నరు..." గిన్నెలు లోపల పెట్టి వచ్చింది యాదమ్మ. గౌరి చీపురు తీసుకెళ్ళి పెరడు తుడుస్తూంది.

యాదమ్మ మాటల్ని వింటూ విస్తుపోయింది సీత. ఏ మాత్రం అక్షరజ్ఞానం లేని యాదమ్మ ఇన్ని మాటలు, ఇంత తెలివిగా ఎలా మాట్లాడగలుగుతూంది? ఎక్కడ నేర్చుకుంది? పుట్టింది, పెరిగింది, పెళ్ళాడి భర్తతో కాపురం చేసిందీ ఆ ఊళ్ళోనే. నాలుగూళ్ళు తిరిగిందీ లేదు, నలుగుర్ని చూసిందీ లేదు. కాని అంత ధైర్యంగా ఎలా మాట్లాడగలుగుతుందాని, ఆలోచించ సాగింది సీత.

"యాదమ్మా.... ఇలా కూచో. నిన్ను కొన్ని ప్రశ్నలడగాలి".

"ఏందమ్మా... నాకు పరీచ్చెడతన్నారా?!... పెశ్నలడగాలంటన్నరు? సర్లెమ్మా... గట్టనే అడగండి". వదులైన జుత్తు ముడి విప్పి గట్టిగా వేసుకుంటూ అక్కడ చతికిలబడింది యాదమ్మ.

"యాదమ్మా!... నువ్వు నీ అల్లుడితో గొడవ పెట్టుకుని నీ కూతుర్ని, మనవల్ని తెచ్చేశావు గదా! తర్వాత నీ అల్లుడు నీ కూతురు నాకక్కర్లేదు పొమ్మంటే!?"

"ఆడనేదేంధమ్మా... నా కూతురికే ఆడక్కర్లేదు పొమ్మంటాను. అవునమ్మగోరూ... రాసపుండు నాంటి బయంకరమైన అనుమానం బుద్ది ఆడికుందని, తెలిసినాక నానింక ఎసుమంటి పరిత్తితుల్లోనూ నా బిడ్డనక్కడికంపేదే లేదు. ఆల్లు ఎందరు పెద్ద మడుసుల్లో ఎట్టనీ, ఏడకెల్లనీ. సూత్తా... సూత్తా... ఆ నకరంలోకి, నా బిడ్డనంపేదే లేదమ్మా..." నిక్కచ్చిగా చెప్పేసింది.

విస్మయంగా చూసింది సీత. "యాదమ్మా!... కాస్త నిదానంగా ఆలోచించు. ఇప్పుడు ఆవేశంలో ఇలా మాట్లాడ్తున్నావ్‌గానీ ... అసలు ... అసలు... నీకెలాంటి ఆధారం, మగతోడు లేకుండా బతుకుతున్నావాయె... అప్పోసప్పో చేసి, కూతురి పెళ్ళి జరిపించి, బాధ్యత తీర్చుకున్నావంటే... మళ్ళీ ఇలా జంజాటం నెత్తిన పెట్టుకుంటావా? నీ కూతురు, ముగ్గురు మనవలు ... ఎలా పోషిస్తావ్? రోజులు గడిచి పంతాలు, పట్టింపులు పెరిగిపోక ముందే, గౌరిని అత్తారింట్లో వదిలిరా.... ఆడదానివి... నీ వల్లనేమౌతుంది చెప్పు?"

"ఏటమ్మా... సదూకున్నోరు... తవరు గూడా ఇట్టాగంటారు? సెట్టుకెప్పుడూ కాయలు బరువుగాదమ్మా. నా రెక్కల్లో ఇంకా సత్తువుంది... ఇప్పుడు నాను సేసుకునే పనికి మరో నాలుగిల్లు పనొప్పుకుంటే నా బిడ్డల్ని మారాజుల్లా సాక్కుంటాను. నాకు ఒక్కగానొక్క గుంట ఈ గవురి. దీనికి సిన్న కట్టవొచ్చినా నాను భరించలేను. ఇది నా బిడ్డమ్మా... దిక్కుమొక్కు లేని అనాద గాదు. దీనికి నానున్నాను. దాన్ని ఆడి పాలబడేసి ఆడెన్ని బాదలెడ్తన్నా సూత్తా ఊరకనుండలేను. అసలు మా గవురే గనక నన్ను బతిమాలుకుని ఆపకుంటే ఆడి సంగతేందో ఆడే తేల్చిపారేసే దాన్నమ్మా... అవునమ్మగోరూ... నా బిడ్డని నానా మాటలంటూ సావ సితగ్గొట్టనీకి ఆడికెవురిచ్చారమ్మా అదికారం? నా పెల్లాం నా


ఇట్టం దీన్ని సంపుకున్నా నరుక్కున్నా నీకడిగే అదికారం నేదన్నాడమ్మా అడు... ఆడకూతుర్ని అగ్గిసాచ్చిగా మనువాడి, దాని కట్టంలోను, సుకంలోను తోడు నీడగుంటూ దానికే ఇశారం నేకండా సూసుకోవాలగాని, తాలిబొట్టు కట్టాను కందా ఆలిమీద అదికారం వొచ్చిసింది, ఇంక దాన్ని నరుక్కున్న, సంపుకున్న నా ఇట్టవంటే ఏ అమ్మ, బాబు వొల్లకుంతారు సెప్పమ్మా? నవమాసాలు మోసి కని పెంచి పెద్దసేసింది అట్టాంటి కసాయోడి పాలబడెయ్యడానికా?

మాయమ్మ, అమ్మమ్మల కాలంలో అట్ట పడుండేవోరంట... కాని, ఇప్పుడట్టా ఎవులూరు కుంటారమ్మా? ఆడకూతుల్ల పచ్చాన ఎన్నో సట్టాలొచ్చిసి నాయంట గందా... నాను పన్జేసే వకీలమ్మగోరు సెప్పినారు. మొగుడు తిట్టినా, కొట్టినా, అత్త ఆడబిడ్డ ఆరల్లెట్టినా పోలీసోల కాడికెల్లి ఆల్ల సెవినడేత్తే సాలంట. నా సావిరంగా ఆల్లని లాక్కెల్లి మోసిప్ప విరిసేసి సిప్పకూడు తినిపించేత్తనారంట. ఐనా ఎవులమ్మా ఉప్పుడిట్టాంటి మొగుల్లను పికర్సేత్తన్నరు? తవరు సదూకున్నోల్లు... ఇయ్యన్నీ తవకే ఎరికవుతది. ఏందో నా ఒల్లు కుతకుత లాడ్తా వుంటే ఇయ్యన్నీ వాగిసినాను. అమ్మగోరూ! నానింక ఎల్తానమ్మా... ఇంకా వకీలమ్మ గోరింటి కెల్లాల. గాందీనగరం రెండో ఈదిలో... ఎవురికో పనిమడిసి కావాలన్నారంట ఆడిక్కూడా ఎల్లి రావాల. రాయేమ్మా గవురమ్మా..." కూతుర్ని తీస్కుని వెళ్ళిపోయింది యాదమ్మ.

యాంత్రికంగానే అక్కడ్నుండి లేచి వెళ్ళి పెరటి తలుపు మూసి వచ్చి హాల్లో కూచుంది సీత. ఆమె మనసంతా గజిబిజిగా తయారైంది. యాదమ్మ మాటలు ఆమెలో కల్లోలాన్ని రేపాయి. ఆ కలవరంలోనే తనలో తాను చూసుకుంది.

గౌరి వున్న పరిస్థితుల్లోనే తనూ వుంది. కాని, యాదమ్మ లాగా తన తల్లిదండ్రులు ఎందుకు ఆలోచించడంలేదు? తన తల్లిదండ్రులు చదువుకున్నవారు. కాని, యాదమ్మ లాగా అంత నిశితంగా ఆలోచించి కూతురి విషయంలో ధైర్యంగా ఓ నిర్ణయం తీసుకోలేక పోతున్నారెందుకని? వాళ్ళ దాకా ఎందుకు తనూ చదువుకుంది. కాని, తన సమస్యల్ని సవ్యంగా సానుకూలంగా తను పరిష్కరించుకో గలుగుతుందా?

రెండు సంవత్సరాల క్రితం తనకు



అంతర్జాతీయ మాతృభాషా దినమును పురస్కరించుకొని 21-2-2003న మదరాసు తెలుగు అభ్యుదయ సమాజము తరపున జరిగిన "అక్షరాభ్యాస" కార్యక్రమంలో పాల్గొన్న సమాజ ఉపాధ్యక్షులు పి.బాలకృష్ణ, వ్యవస్థాపక కార్యదర్శి పేరిశెట్టి భాస్కరుడు, ముఖ్య అతిథి శ్రీ కృష్ణయ్యశెట్టి, సమాజ సభ్యులు లాలిదేవర, సజ్జా వెంకటేశ్వర్లు, ఉమ్మిటు ధనంజయం, మోహనరావు తదితరులు

రామ్మోహన్‌తో వివాహమైంది. ఈ రెండు సంవత్సరాల కాలంలో ఇరవై సంవత్సరాలకు సరిపడా వేదన అనుభవించింది తను. పెళ్ళికి ముందు కన్నెగా ఎన్నో కలలు కంది. కోట్లకు పడగలెత్తిన వాడో, లక్షాధికారో తనకు భర్తగా రావాలని ఏనాడూ ఆశించలేదు. కాని మంచి మానవత్వం వుండి, తనని అర్థం చేసుకుని సుఖపెట్టే సంస్కారవంతుడు కావాలని కోరుకుంది. కాని అదీ తనకు అత్యాసే అవుతుందని తెలుసుకోలేకపోయింది. తన ప్రతి అడుగూ, ప్రతి కదలికా అనుమానపు దృష్టితో చూసే రామ్మోహన్ తనకు భర్తగా దొరికాడు.

"కో ఎడ్యుకేషన్ కాలేజీలో చదివావు గదా! ఎందరు కుర్రాళ్ళతో క్లోజ్‌గా మూవ్ అయ్యేదానివి? అదే! నువ్వు కాస్త ఎర్రగా బుర్రగా స్మార్ట్ లుక్‌తో స్టన్నింగ్ బ్యూటీలా వుంటావు గదా! కాలేజీ కుర్రాళ్ళంతా నీ వెంట బడుంటారు! వాళ్ళతో సినిమాలని, షికార్లని, పిక్నిక్కులని బాగా ఎంజాయ్ చేసుంటావే! సీతా నీ పేరు నీకు నప్పిందంటావా? మీ బామ్మ పెట్టుంటుందా పేరు. కాని నీకు సూటబుల్ పేర్లేంటో చెప్పనా? సర్లే! ఇప్పుడా పేర్ల గొడవెందుగ్గాని? నీ లవర్స్ పేర్లేంటో, మీరు ఎక్కడెక్కడ తిరిగేవారో ఎలా ఎంజాయ్ చేసేవారో చెప్పవా? ప్లీజ్... ప్లీజ్ సీతా! భార్యాభర్తల మధ్య రహస్యాలుండకూడదమ్మా! పాపం చుట్టుకుంటుంది. లేడీస్ ఫస్టన్నారు గదాని నిన్ను ముందడిగాను. పోన్లే నువ్వు మొహమాట పడ్తున్నట్టున్నావ్. పోనీ, నా గురించి చెప్పనా ...? నేను కాలేజీలో చదువుకుంటున్నప్పుడు శిరీష అనే అమ్మాయిని లవ్ చేశాను. ఆ పిల్ల నీ అంత అందగత్తె కాదనుకో. కాని, అప్పుడు ఆ పిల్లే నా కంటికి రంభలా గుండేది.


చాలా సరదాగా తిరిగేవాళ్ళం. చివరికి పెళ్ళి కూడా చేసుకుందామనుకునేసరికి వాళ్ళింట్లో పెద్దవాళ్ళు ససేమిరా ఒప్పుకోలేదు. ఆ తర్వాత ఓ మేరేజ్ ఫంక్షన్‌లో నిన్ను చూడ్డం, నీ మీద మనసు పారేసుకుని పెళ్ళి చేసుకోవడం జరిగింది. చూశావా! నేనెంత నిజాయితీగా నా ఫ్లాష్‌బేక్ నీకు చెప్పానో...! నువ్వూ అలాగే చెప్పాలి. జస్ట్ ఒకరి గురించి ఒకరం తెలుసుకుంటే మన మధ్య అరమరికల్లేకుండా సరదాగా, సంతోషంగా వుండొచ్చు. ప్లీజ్... చెప్పవా సీతా...?

మొదటి రాత్రి భర్త అలా అడిగేసరికి మొదట బిత్తరపోయినా తర్వాత తనని తాను సర్దుకుని అతనంత క్లోజ్‌గా తన గురించి చెప్పినప్పుడు తను చెప్తే తప్పేంటని నోరు విప్పింది సీత.

"లేదండీ... నేనెవ్వరితోనూ క్లోజ్‌గా వుండేదాన్ని కాదు. చాలా మంది నాకు లవ్‌లెటర్స్ రాసేవాళ్ళు. అవన్నీ పట్టుకెళ్ళి ప్రిన్సిపాల్‌గారికిస్తే... వాళ్ళందర్నీ ఆయన గట్టిగా వార్నింగిచ్చేసరికి

బుద్ధిగా వుండేవారు. కాని, అందర్లోకి రాజా అనే అబ్బాయి మాత్రం తన మొండిపట్టు వదలకుండా నా వెన్నంటి తిరిగేవాడు. నన్ను అల్లరి పెట్టకపోయినా రోజా కాలేజీకెళ్ళేప్పుడు, వచ్చేప్పుడు నా వెనకే ఫాలో అయ్యేవాడు. ఓ రోజు నాకే అయ్యో పాపం అనిపించి మాట్లాడాను. అలా మా మధ్య మాటలు పెరిగి మంచి స్నేహితులమయ్యాం..."

భార్య మాటల్ని మధ్యలోనే అడ్డుకున్నాడు రామ్మోహన్. "సీతా... ఆగాగు. చిన్న ఎడ్జస్ట్‌మెంట్ చెయ్యాలి. రాజా నువ్వు స్నేహితులు కాదు.



ప్రేమికులనాలి. యామై కరెక్ట్? చూశావా నీ నుండి నిజాన్ని ఎలా రాబట్టానో...!? నాకు శిరీష అనే అమ్మాయితో పరిచయం, ప్రేమ అదంతా వట్టిదే. అసలు శిరీష అనే అమ్మాయే మా క్లాసులో లేదు. ఇప్పటికిప్పుడు కల్పించి నీకు చెప్పిన కథ ఇది. ఊ, అయితే రాజా, నువ్వు ప్రేమికులు. క్లాసులు ఎగ్గొట్టి హోటల్ రూమ్స్‌లో ప్రేమ సామ్రాజ్యాన్నేలే వారు... కదూ...!?"

భర్త మాటలకు నిలువు గుడ్లేసుకుని ఉండిపోయింది సీత. ఇంక ఆ క్షణం నుండి మొదలైంది ఆమెకు టార్చర్. "ఆ రాజా నీతో ఎలా బిహేవ్ చేసేవాడు? ఇక్కడ ముట్టుకునేవాడా? ఇలా ముట్టుకునేవాడా? ఇంకా సున్నితంగానా? వాడితో వున్నపుడు బావుండేదా? నాతోనా?" అంటూ ఇంకా ఎంతో నీచమైన మాటలతో భార్య మనసు తూట్లు పొడిచేవాడు.

రానురాను చెయ్యి చేసుకోవడం మొదలెట్టాడు. మాటాడకుండా వుంటే మూగి మొద్దులా నోరు విప్పవేంటని తిట్టేవాడు. సమాధానమిస్తే నాకే ఎదురు సమాధానమిస్తావా అని కొట్టేవాడు. సీత రాను మొర్రో అంటున్నా బైటికి తీసుకెళ్ళడం, ఇంటికొచ్చాక 'వాడివంక చూశావు, వీడ్ని చూసి కన్నుగొట్టావు, పూర్వ పరిచయం లేందే వాడెందుకు నిన్నలా తినేసేలా

## టైమ్ బావుంది

*బక్క పల్చని భామ శిల్పాశెట్టిని పెళ్ళెప్పుడూ అని అడిగితే, 'నా పేరెంట్స్ కూడా పెళ్ళి చేసుకోమని ఒత్తిడి చేస్తున్నారు, కానీ ఇప్పుడిప్పుడే నాకు మంచి సినిమాల్లో ఆఫర్స్ వస్తున్నాయి. ఇలాంటి టైమ్‌లో పెళ్ళి చేసుకొని లైఫ్‌లో సెటిలవ్వడం నాకిష్టం లేదు' అంది. ఎంచక్కా సోనాలి బింద్రేలాగా పెళ్ళయ్యాక కూడా నటించవచ్చు కదా అంటే 'పెళ్ళి తరువాత ఇప్పటిలా ఫ్రీడమ్ ఉండదు. అప్పుడు నటిస్తానో లేదో కూడా తెలీదు' అందుకే ముందు జాగ్రత్త' అని చెప్పింది. దీపం ఉండగానే ఇల్లు చక్క పెట్టుకునే తెలివి తేటలు నాలో పుష్కలంగా ఉన్నాయని ఇండైరెక్ట్‌గా చెప్పిందన్నమాట.*

చూస్తాడు?' అంటూ పెద్ద గొడవ సృష్టించేవాడు.

పుట్టింటికొచ్చినపుడు తల్లిదండ్రుల్తో చెప్పుకుని ఏడ్చింది సీత. "అమ్మా సీతా! ఒక తల్లికి పుట్టిన పిల్లలే రూపంలోనైతేనేమి, గుణంలోనైతేనేమి ఒకేలా వుండనట్టే మగాళ్ళందరి మనస్తత్వాలూ రకరకాలుగా వుంటాయమ్మా. ఓర్చుకో. నీ ఓర్పే నీకు శ్రీరామరక్ష. ఇంకెంత నీకు ఓ బిడ్డ పుడితే అతన్లో మార్పు వచ్చేస్తుంది. అప్పటి దాకా, నువ్వు అణిగి మణిగి ఓర్పుతో వుండాలి" ఇలా హితబోధలు చేసి తిరిగి కూతుర్ని అల్లుడి దగ్గరకు పంపేవారు.

ఇప్పుడు సీత... ఓ బిడ్డకు తల్లి. ఆమె తల్లిదండ్రులు చెప్పినట్టు అతన్లో నిజంగానే మార్పు వచ్చింది. పుట్టిన బిడ్డని, మూలకేంద్రంగా పెట్టుకుని కొత్తరకం సాధింపు మొదలెట్టాడు. "ఏంటీ వీడి మొహంలో కాగడా పెట్టి వెదికినా నా పోలికలెక్కడా కనిపించడంలేదు? ఈ కళ్ళు నావి గావు, ముక్కు నాది కాదు. నోరు సరేసరి, జుత్తు క్వైట్ ఆపోజిట్. అసలు టోటల్‌గా వీడు నా కొడుకు కాడనిపిస్తుంది. వీడు నీ కడుపున పడకముందు నేను మద్రాసు క్యాంపు కెళ్ళినప్పుడు ఓ నెల్లాళ్ళ పాటు నీ పుట్టింటికెళ్ళి వచ్చావు కదా అప్పుడు మీ అక్కలిద్దరూ బావలిద్దరూ కూడా పది రోజులు అక్కడే ఉన్నారని చెప్పావు. నువ్వు మీ అమ్మగారింటి నుండి రాగానే నెల తప్పానని చెప్పావు. అదీ విషయం. చచ్చు వెధవని. అప్పట్లో నా మట్టిబుర్రకి తట్టనేలేదు ఈ ఆలోచన. మీ బావలిద్దర్లో ఎవరి పోలికంటావ్ ఈ వెధవ?" ఇలా సాగేది అతని సాధింపు.

జీవితం నరక ప్రాయమైపోయింది సీతకు. ఇంక రాజీపడుతూ అతన్తో కలిసి ఆ నరకంలో బతకలేను. పుట్టింటికెళ్ళినా అక్కడ తన బాధనర్థం చేసుకుని ఆదుకునే వాళ్ళు లేరు. అయినా ఎంతకాలమని ఒకరిమీద ఆధారపడి బతకాలి? యాదమ్మ పాచిపని చేసుకుంటూ తన కూతుర్ని, మనవల్ని పోషించుకుంటానని, అంత ధీమాగా, ధైర్యంగా చెప్పింది. తన చేతిలో చదువు సంపాయించిపెట్టిన డిగ్రీ వుంది. ఆపాటి ఆత్మస్థైర్యం తనకు లేదూ? ఎక్కడోచోట పని వెదుక్కుని తన బిడ్డను పోషించుకుంటూ తను బతకలేదూ...!? ఎస్... బతుకుతుంది. తన బతుకు తను బతుకుతుంది. యాదమ్మను చూశాకనే తనకిలాంటి ఆలోచన వచ్చింది. తన కళ్ళు విప్పి తనేంటో తెలుసుకునేలా చేసింది యాదమ్మ. ఆడాళ్ళకి తన పేరు పక్కన తగిలించుకునే డిగ్రీలున్న చదువు ఒక్కటే సరిపోదు. లోకాన్ని సునిశితంగా చదివి దానికి ధీటైన సమాధానం చెప్పగలిగే మనోస్థైర్యం వుండాలని తెలియజెప్పింది యాదమ్మ. హేట్సాఫ్ టు యాదమ్మ...

తన బాధామయమైన జీవితానికో సంతోషకరమైన సమాధానం దొరకడంతో సీత మనసుకెంతో నిశ్చింతగా, ధైర్యంగా వుంది. వెంటనే లేచి తనవి, బాబువి బట్టలు ఓ సూట్‌కేసులో పెట్టుకుని, కొడుకుని, భుజాన్నేసుకుని ఆ ఇంటి నుండి బయటపడింది సీత. ❀